క్లుప్తంగా

తిమ్మాపూర్ సీఐగా స్వామి

ఇదే మొదటి లా అండ్ ఆర్డర్ పోస్టింగ్



బాధ్యతలు స్వీకరిస్తున్న స్వామి

తిమ్మాపూర్: తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కర్రె స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఇంద్రసేనా రెడ్డి ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ట్రాన్స్‌కోలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న స్వామి తిమ్మాపూర్‌కు బదిలీపై వచ్చారు. సీఐగా ప్రమోషన్ వచ్చి ఏడేళ్లు గడిచినా ఇదే మొదటి లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ కావడం గమనార్హం. గతంలో టాస్క్‌ఫోర్స్, రైల్వే, ఎస్బీలో పనిచేశారు. నూతన సీఐకి ఎల్ఎండీ, గన్నేరువరం, చిగురుమామిడి ఎస్సైలు చేరాలు, నరసింహారావు, రాజేశ్ స్వాగతం పలికారు అదే విధంగా సర్కిల్ పోలీస్ సిబ్బంది పూల మొక్కలతో స్వాగతం పలికారు.

ఎస్సైని సన్మానించిన నాయకులు



వీణవంక: వీణవంక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణను మండలంలోని పలువురు నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య సంఘం డివిజన్ అధ్యక్షుడు తాండ్ర శంకర్, కండె మహేందర్, పులి ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు ఎండీ సాహెబ్‌హుస్సేన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చదువు జైపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, ఈదునూరి పైడి కుమార్, సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మానకొండూర్: మండల కేంద్రంలో సీఐ మాదాసు సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌తో పాటు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్తా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రణవ్

జమ్మికుంట: ఆటోనగర్ హౌజింగ్ సొసైటీ ఇళ్ల నిర్మాణాల సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆటోనగర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 360 మందిని ఎంపిక చేసి లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయగా స్థలాలను వొడితెల ప్రణవ్ గురువారం పరిశీలించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టి ఆర్థిక సమస్యలతో మధ్యలోనే నిలిపేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు నిర్మాణానికి కృషి చేయాలని ఆటోనగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణస్వామి, కార్యదర్శి వెంకన్నతోపాటు కార్మికులు వివరించారు. కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రణవ్ అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకన్న, సుంకరి రమేశ్, నాయకులు ఎండీ సలీం, చిన్నింటి నాగేంద్ర, యెగ్గని శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, పర్లపల్లి నాగరాజు, అన్నం ప్రవీణ్, సలీం, ముద్దమల్ల రవి, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై విచారణ

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ సర్వే నంబర్ 688లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు తూడి రవిచందర్, వరంగల్ ఆర్డీఎం అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు వరంగల్ హౌజింగ్‌బోర్డు ఏఈ రవిప్రసాద్ గురువారం విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమిలోని నిర్మాణాన్ని నిలిపేసి తగు చర్యలు తీసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు నివేదికను అందజేశారు.

పనులు షురూ...

- సుడా నిధులతో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- మూడు గ్రామాల్లో పూర్తి కావస్తున్న నిర్మాణ పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న యువత



వెదిర జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు

రామడుగు: పట్టణ ప్రాంతాల్లో మాత్రమే వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు జరిగేది. కానీ ఇప్పుడు పల్లె ప్రజలకు అనుకూలంగా వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తుండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు, యువత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పోలీసు వంటి పోటీ పరీక్షలకు వెళ్లే యువతకు వీటివల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

సుడా నిధులు మంజూరు

మండలంలోని వెదిర, కిష్టాపూర్, దేశరాజ్‌పల్లి, వెలిచాల, కొక్కెరకుంట, వన్నారం, గ్రామాలను ప్రభుత్వం సుడా (శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ) పరిధిలోకి తీసుకెళ్లడంతో ఈ గ్రామాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి. వెదిరలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.15 లక్షలు, దేశరాజ్‌పల్లిలో ఓపెన్ జిమ్‌కు రూ.15 లక్షలు, కొక్కెరకుంటలో ఓపెన్ జిమ్‌కు రూ.5 లక్షలు, కిష్టాపూర్‌లో ఓపెన్ జిమ్‌తో పాటుగా వీధి లైట్ల కోసం రూ.7 లక్షలు, వెలిచాలలో సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణ పనులకు రూ.50 లక్షలు సుడా ద్వారా నిధులు మంజూరయ్యాయి.

పూర్తి కావస్తున్న నిర్మాణాలు...

నిధులు మంజూరైనా పనులు చేపట్టడం కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయి. వెదిర గ్రామంలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ పనులు కొనసాగుతున్నాయి. దేశరాజ్‌పల్లి, కొక్కెరకుంట, కిష్టాపూర్ గ్రామాలలో ఓపెన్ జిమ్ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. వెలిచాల గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పట్టణాలకే పరిమితమైన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడంతో యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. శారీరకదారుఢ్యానికి ఉపయోగపడతాయని, పోలీస్, ఆర్మీ వంటి ఉద్యోగాలు సాధించేందుకు వినియోగించుకోవచ్చని అంటున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో వెదిర గ్రామానికి చెందిన పలువురు వాకర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో రోడ్డు వెంట ఇబ్బందికరంగా వాకింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తుందని, పాఠశాలలో ట్రాక్ నిర్మాణం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వెదిర వాకర్స్ సంఘం అధ్యక్షుడు పులి కొమురయ్య తెలిపారు.

సంతోషంగా ఉంది



పాఠశాల ఆవరణలో సుడా నిధులతో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లతో యువతకు చాలా ఉపయోగం. చాలా రోజుల నుంచి వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో యువకులు, వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు నిర్మాణం పూర్తికావడం సంతోషంగా ఉంది.

– పాడేటి హరీశ్‌గౌడ్, వెదిర

ఇబ్బంది పడ్డాం



వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో చాలా ఏళ్ల నుంచి ఇబ్బందిపడుతున్నాం. రోడ్డు వెంట వాకింగ్ చేస్తూ పలుమార్లు వాహన ప్రమాదాల నుంచి బయటపడ్డాం. ఇప్పుడు పాఠశాలలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– గాజుల ఆనందం, ఎల్ఐసీ ఉద్యోగి, వెదిర

త్వరలో అందుబాటులోకి



మండలంలోని ఐదు గ్రామాలు సుడా పరిధిలో ఉన్నాయి. నిధులు మంజూతో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాం. కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని పూర్తి కావస్తున్నాయి. త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

– సత్తయ్య, సుడా ఏఈ, కరీంనగర్

అయోధ్య రాములోరి అక్షింతలు పంపిణీ



జమ్మికుంట: భక్తులకు అక్షింతలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు, భక్తులు

జమ్మికుంట: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ఆధ్వర్యంలో నాయకులు, భక్తులు పట్టణంలోని శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 30వ వార్డులో ఇంటింటికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు అక్షింతలు పంపిణీ చేస్తామని, 22న అయోధ్యలో బాలరాముల విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని, ఆరోజు భక్తిశ్రద్ధలతో ప్రతి ఇంటి ఎదుట రాత్రి ఐదు దీపాలను వెలిగించాలని కోరారు. ఈకార్యక్రమంలో నిరుపారాణి, నాగేశ్, సమ్మయ్య, మల్లేశ్ భక్తులు అధికంగా పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలకు సిద్ధార్థనగర్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో పందిళ్ల భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలోని ఇంటింటికీ అక్షింతలను కాలనీ కమిటీ సభ్యులు, సంఘ పరివార సంస్థ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాసాడి ముత్యంరావు, సిద్ధార్థ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సాగి వీరభద్రరావు, కమిటీ సభ్యులు బత్తుల మనోజు, టూమ్ వెంకట్‌రెడ్డి, కాసర్ల శ్రీహరి, అంబరీష, రావుల తిరుపతిరెడ్డి, సంఘ పరివార సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



సిద్ధార్థ కాలనీలో అక్షింతలు పంపిణీ చేస్తున్న కాలనీ కమిటీ, సంఘ పరివార సంస్థ సభ్యులు

బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి



చిన్నారితో మాట్లాడుతున్న కోఆర్డినేటర్లు

మానకొండూర్: బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలని జిల్లా సమగ్ర శిక్షణ కో ఆర్డినేటర్లు కె.అశోక్ రెడ్డి, ఈ.ఆంజనేయులు గురువారం సీఆర్పీలు, ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీని సందర్శించిన అనంతరం సీఆర్పీలు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి సమగ్ర శిక్షణ కార్యక్రమంలో భాగంగా బడి బయటి పిల్లలను గుర్తించడం జరుగుతుందని, 6–14, 15 –19 వయసు గల పిల్లలను పాఠశాల, కళాశాలల్లో చేర్పించేలా చూడాలని, 1–18 ఏళ్లలోపు ఉన్న వికలాంగులను గుర్తించాలన్నారు. వెంట మానకొండూర్ నోడల్ అధికారి డి. శ్రీనివాస్, ప్రైమరీ హెచ్ఎం, షహనాజ్‌ఫాతిమా, ఉపాధ్యాయులు, నయీముద్దీన్, సీఆర్పీ వసంత పాల్గొన్నారు.

‘ప్రజాపాలనను స్వాగతిస్తున్నారు’



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న రావుల రమేశ్

తిమ్మాపూర్: ప్రజాపాలనను ప్రజలు స్వాగతిస్తున్నారని అర్హులకు ఆరు గ్యారంటీలను పక్కగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్, పొరండ్లలో గురువారం నిర్వహించిన ప్రజాపాలనకు హాజరయ్యారు. ఎమ్మెల్యేకు సర్పంచులు రావుల రమేశ్, రెడ్డి త్రివేణి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజా భవన్‌లోకి అందరికీ ఆహ్వానం ఉందని తెలిపారు. అనంతరం అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జయశంకర్, తహసీల్దార్ కనుకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు కొత్త తిరుపతిరెడ్డి, చింతల రజిత, నాయకులు శ్రీనివాస్, నరసింహారెడ్డి, కిషన్ రెడ్డి, రమేశ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, స్వామి రెడ్డి, రంగారావు, సురేందర్ రావు తదితరులున్నారు.

మానకొండూర్‌రూరల్: ఆరు గ్యారంటీలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పచ్చునూర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. మహిళా సమైఖ్య సంఘాన్ని పరిశీలించి సొంత డబ్బులతో కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు.

శంకరపట్నం: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికి పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ముత్తారం, మక్త, మెట్‌పల్లి, రాజాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మీసేవా కార్యాలయాల చుట్టూ తిప్పి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తుందన్నారు. ఎంపీడీఓ శ్రీవాణి, తాసీల్దార్ అనుపమ, సర్పంచ్‌లు రేణుక, సరోజన, వసంత, సుష్మ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గ్యారంటీలను అమలు చేస్తాం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కాట్నపల్లిలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో స్వరూప, ఎంపీవోవ రాజగోపాల్ రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రం తనిఖీ...

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని 13వ వార్డులోని ఇందిరానగర్ కాలనీలో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తనిఖీ చేశారు.

జమ్మికుంట: పట్టణంలోని 30 వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ సంతోష్, మున్సిపల్ సిబ్బంది శ్రీకాంత్, సాయి, రవి, ఆర్పీలు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రతీ పథకం లబ్ధిదారులకు చేరాలి

వీణవంక: అర్హులకు ప్రతి పథకం చేరేలా అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. వివిధ గ్రామాలలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పరిశీలించారు.

దరఖాస్తుల వెల్లువ

సైదాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువెత్తాయి.

చిగురుమామిడిలో ముగిసిన ప్రజాపాలన

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు గురువారంతో ముగిశాయి. గురువారం సుందరగిరి, ఉల్లంపల్లి గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు.

ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికిన కౌశిక్‌రెడ్డి



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఇటీవల ప్రమాదశాత్తు జారిపడటంతో తుంటి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం కేసీఆర్‌ను పరామర్శించేందుకు ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రాగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అధ్యాపకురాలికి సన్మానం



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరాదేవి

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర సహాయ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శ్యామలాదేవి ఉత్తమ అధ్యాపకురాలిగా మంత్రి సీతక్క చేతుల మీదుగా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా అవార్డు అందుకున్నారు. శ్యామలాదేవిని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి గురువారం శాలువాతో సత్కారించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీనరసింహమూర్తి, కోఆర్డినేటర్ డాక్టర్ పి. దినకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ హరిప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ నిధులు విడుదల చేయాలి

జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. గత ప్రభుత్వం కేటాయించిన నిధులు ఉన్నాయని జిల్లా అధికారులు పలు సందర్భాల్లో తెలిపారని, రేషన్ కార్డు లేదని కొందరికీ పథకం అమలు కాలేదని, కొత్త రేషన్ కార్డులు ఇచ్చి అర్హులైన నిధులు మంజూరు చేయాలన్నారు.

గోమాత బాధితులకు పరామర్శ



గోమాతను అందిస్తున్న సభ్యులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో గోమాత బాధితులు గాజుల పద్మకుమారస్వామిని గురువారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు పరామర్శించారు. అనంతరం గోరక్ష విభాగ్ ప్రముఖ్ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి తనసొంత గోమాతను అందజేశారు. పద్మకుమారస్వామికి చెందిన గోమాతను వధించిన సంఘటన కస్నీజుజీ తెప్పించిందన్నారు. నిందుతులను అరెస్ట్ చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గోరక్ష ప్రముఖ్ నాయకులు గిరిధర్‌లాల్, కె.రాజయ్య, డి. కొమురయ్య, డి. నరేందర్, బి.తిరుపతిరెడ్డి, జి.వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆర్ఎంవోకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సమయపాలన పాటించని వైద్యులు, వైద్య సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆసుపత్రి ఆర్ఎంవో సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ.. వైద్యులు, వైద్య సిబ్బంది సకాలంలో రాకపోవడంతో రోగులకు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలను కోల్పోతున్నారని, చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు వంశీ, రవీందర్, రాజు ఉన్నారు.

టిప్పర్‌లో చెలరేగిన మంటలు



గంగాధర: మండలంలోని ఒద్యారం గ్రామంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. డీజిల్ పోయించుకోవడానికి టిప్పర్ పెట్రోల్ బంకు రాగా ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. క్యాబిన్‌లోకి మంటలు వ్యాపించడంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. స్థానికులు, పెట్రోల్ బంకు సిబ్బంది అరగంట సేపు శ్రమించి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ

ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గురువారం స్కూటీని లారీ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మొలంగూర్ గ్రామానికి చెందిన నరహరి బుచ్చిరెడ్డి స్కూటీపై కేశవపట్నం వస్తుండగా లారీ ఢీకొందని, వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలించామన్నారు.

తప్పిన పెను ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వద్ద కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై లోడ్‌తో వెళ్తున్న లారీ టైర్‌ల నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే గ్రామానికి చెందిన ఇజ్జగిరి ప్రభాకర్ అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించారు. హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది ఎస్‌హెచ్‌వో రాజయ్య, ఎల్‌వో సురేందర్, ఫైర్‌మన్ అనిల్‌కు లారీ డ్రైవర్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

రామడుగు: పోస్టల్‌లోని పలు పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, వడ్డీరేట్లు మార్చి 31వ తేదీ నుంచి వర్తిసాయని కరీంనగర్ పోస్టల్‌శాఖ నార్త్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. కొత్త వడ్డీరేట్లతో తపాలా శాఖ నిర్వహిస్తున్న స్పెషల్ మేళా కార్యక్రమంలో భాగంగా గురువారం రామడుగు సబ్ పోస్టాఫీసులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పోస్టల్ సిబ్బంది నిత్యం ప్రజలతో కలిసి తపాలాశాఖ చేపడుతున్న ఆర్థిక చేయూత పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీఎంలు అజ్మత్ అలీ, స్వామి, మహేశ్, వీణాశ్రీ, మల్లేశం, శేఖర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని విశ్వేశ్వర ఫంక్షన్ హాల్‌లో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సెయింట్‌పాల్ స్కూల్ 1996–97 పదో తరగతి విద్యార్థులు ఒకచోట చేరి చదువుకున్న రోజులు గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

విహారయాత్రకు రుద్రారం విద్యార్థులు



రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు విజ్ఞానయాత్రలో భాగంగా తిరుమల, రాజమండ్రి, అన్నవరం, సింహాచలం, అరకు బొర్రగుహలు, కైలాసగిరి, రుషికొండ బీచ్, రామకృష్ణబీచ్, భద్రాచలం ప్రాంతాలను సందర్శించారని హెచ్ఎం జీపీవీ రంగనాథశర్మ తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అవధూత శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రవీందర్, పద్మజారాణి, శంకరయ్య వెళ్లారని తెలిపారు.